## ఎన్నికల నిబంధనలు పాటించాలి

- అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్
- రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

పాలకుర్తి రూరల్, అక్టోబర్ 13 : ఎన్నికల కోడ్ ఈ నెల 9వ తేదీ నుంచి అమలులోకి వచ్చినందున అన్ని రాజకీయ పార్టీలు నిబంధనల మేరకు నడుచుకోవాలని పాలకుర్తి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్ని రాజకీయ పార్టీలకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల ప్రవర్తన నియామవళిపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ రాజకీయ పార్టీల సభలు సమావేశాలతోపాటు ర్యాలీలు అన్ని వాహనాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ప్రభు త్వ విద్యా సంస్థలతోపాటు ప్రభుత్వ కార్యాలయాలపై రాజకీయ పార్టీల ప్రచారాల పోస్టర్లు ఉండకూడదన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్ కోసం నవంబర్ 8వ తేదీ వరకు అవకా శం కల్పించామన్నారు. సభలు సమావేశాల్లో కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రసంగాలు చేయరాదన్నారు. ఫిర్యాదుల కోసం 1950తోపాటు 08716 293571 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలన్నారు. అభ్యర్థుల ఖర్చు నామినేషన్ వేసిన నాటి నుంచి లెక్కలోకి వస్తుందన్నారు. ఒక్కో అభ్యర్థి రూ.40లక్షలు ఖర్చు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా నామినేషన్ వేసే అభ్యర్థులు నామినేషన్ అప్లికేషన్‌తోపాటు నోటరీతో ఆర్వో కార్యాలయంలో అందజేయాలని సూచించారు. రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిర్వహణకు అధికారులకు స హకరించాలని సూచించారు. రెండు మూడు రోజు ల్లో రాజకీయ పార్టీలు బూత్‌లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. ఏఆర్వో తీరందాస్ వెంకటేశం, తహసీల్దార్లు ఆంజయ్య, హుస్సేన్, వినోద్, శ్రీనివాస్, ఎస్సై తాళ్ల శ్రీకాంత్, ఏవీఐ ఫహీమా, ఎలక్షన్ డీటీ రామారావు, ఆర్ఐలు రాకేశ్, శరత్ చంద్ర, ఎంపీడీవో వనపర్తి అశోక్‌కుమార్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## పాలకుర్తి నియోజకవర్గ ఎన్నికల స్వరూపం

- మండలాలు ఆరు, గ్రామాలు 178 గ్రామాలు
- 294 పోలింగ్ స్టేషన్లు
- మొత్తం ఓట్లు 2,43,730
- పురుషులు 1,22,040
- స్త్రీలు 1,21,682
- థర్డ్ జండర్ 8



దేవరుప్పుల/పాలకుర్తి రూరల్, అక్టోబర్ 13 : పాలకుర్తి నియోజకవర్గం ఆరు మండలాల్లో విస్తరించి ఉంది. అం దులో పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంతోపాటు కొడకండ్ల, రాయపర్తి, తొర్రూరు, పెదవంగర, దేవరుప్పుల మండలాలు ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 178గ్రామ పంచాయతీలు ఉన్నా యి. తెలంగాణ రాక ముందు 101గ్రామాలు ఉండగా 77తండాలు గ్రామపంచాయతీలుగా ఏ ర్పడడంతో 178గ్రామపంచాయతీలకు చేరింది. తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గ నం బర్ 100గా ఉంది. ఇప్పటి వరకు ముద్రించిన ఓటరు జాబితా ప్రకారం 2,43,730 లక్షల ఓట్లు ఉన్నాయి. అందులో 1,22,040 పురుషులు, 1,21,682 స్త్రీలు, 8మంది థర్డ్ జండర్ ఉన్నారు. కాగా 294పోలింగ్ స్టేషన్లలో ఎన్నికల నిర్వహణ జరుగుతుంది. మొదటి నంబర్ పోలింగ్ స్టేషన్ పాలకుర్తి మండలం గూడూరు గ్రామంలో మొదలవుతుండగా చివరగా తొర్రూరు మండలం మాటేడులో 294నంబర్ పోలింగ్ బూత్ ఉంటుంది. ఓటరు జాబితాలో 18–19యేళ్ల యువత 7775ఉండగా, 20నుంచి 29 సంవత్సరాల యువతీయువకులు 48,238, 30–39 వయస్సుగల ఓటర్లు 55,395, 40–49 వయస్సు 50,326 మంది, 50–59 మధ్య వయస్సు గల వారు37,061, 60–69 మధ్య 25,036, 70–79 మధ్య ఓటర్లు 14,809, 80–89 మధ్య వయస్సు వారు 4,265, 90–99 మధ్య వయస్సు గల ఓటర్లు 746 మంది, వంద ఏళ్లు దాటిన వారు 79మంది ఉన్నారు.

### మండలాల వారీగా ఓటర్ల వివరాలు..

నియోజకవర్గంలో అత్యధికంగా ఓటర్లు తొర్రూరు మున్సిపాలిటీతోపాటు మండల వ్యాప్తంగా 64వేల 109మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 31వేల 811మంది, స్త్రీలు 32వేల 292మంది ఉన్నారు. రెండో స్థానంలో పాలకుర్తి మండలంలో 49వేల428 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 24వేల 813మంది, స్త్రీలు 24వేల 615మంది ఉన్నారు. మూడో స్థానంలో రాయపర్తి 43వేల828మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 21వేల952మంది, మహిళలు 21వేల876మంది ఉన్నారు. నాలుగో స్థానంలో దేవరుప్పుల 35వేల 20మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 17వేల 740మంది, ఆడవారు 17వేల 280మంది, కొడకండ్ల మండలంలో 27వేల 76మంది ఓటర్లు ఉండగా మగవారు 13వేల609, ఆడవారు 13వేల 465మంది, పెద్ద వంగర మండలంలో 24వేల 269మంది ఓటర్లు, మగవారు 12వేల115, ఆడవారు 12వేల 154 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ స్టేషన్లు పాలకుర్తిలో 60, దేవరుప్పులలో 41, కొడకండ్లలో 36, పెద్ద వంగరలో 31, రాయపర్తి 52, తొర్రూరులో 74కలిగి ఉన్నాయి.


బతుకమ్మలతో ర్యాలీగా వస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

## 'బాలయేసు'లో బతుకమ్మ సంబురాలు

దేవరుప్పుల, అక్టోబర్ 13 : మండల కేంద్రంలోని బాలయేసు ఆంగ్ల మాద్యమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తంగేడు పూలు, బంతి పూలు చేకరించుకురాగా 10ఫీట్ల ఎత్తుతో 4భారీ బతుకమ్మలను వాహనాలపై పేర్చి, 200బతుకమ్మలను విద్యార్థులు చేత బూని జాతీయ రహదారిపై మంగళ వాయిద్యాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ తల్లి చౌరస్తాకు చేరుకున్నారు. వాహనాలపై పేర్చిన 10ఫీట్ల బతుకమ్మలను రహదారిపై నిలిపి విద్యార్థులు తెచ్చిన బతుకమ్మతో వేడుకలను జరుపుకున్నారు. విద్యార్థులంతా పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. వేడుకను చూడడానికి జనం భారీగా తరలివచ్చారు. రెండు గంటలపాటు జోరుగా సంబురాలు జరుపుకున్నారు. దేవరుప్పులలో ఒక రోజు ముందే పెత్రమాస వచ్చిందా అనేలా ఈ వేడుకలు భారీగా జరుగగా పాఠశాల యాజమాన్యం వేడుకకు హాజరైన వారందరికీ మిఠాయిలు పంచారు. పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసు రాజ్ సూసాయప్పన్, ఉపాధ్యాయులు ఈటూరి రమాదేవి, ఈదునూరి అనిత, నీరటి విజయలక్ష్మి, సరిత, కల్యాణి, మాధవి, రజని, శైలజ, శ్వేత, సామ్యూల్, డేవిడ్, ఖాజా నసీరుద్దీన్, మహేశ్, పాషా, కృష్ణ ఉన్నారు.

## మోదీ మాటలు నమ్మి మోసపోవద్దు

### హైకోర్ట్ రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రకుమార్

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 13: ప్రజలు మోదీ మాటలు నమ్మి మోసపోవద్దని హైకోర్ట్ రిటైర్ట్ జడ్జి చంద్రకుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పేరాల కట్టయ్య ఫంక్షన్ హాల్‌లో ప్రగతి శీల యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర 8వ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో కుల, మతాలకు అతీతంగా సమాజంపై బాధ్యయుతమైన ఆలోచనా విధానం కలిగి ఉండాలన్నారు. దేశ నిర్మాణానికి యువత శాస్త్రీయ దృక్పథంతో మెలగాలన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వం యువతకు వివిధ రంగాల్లో ఉద్యోగాలను కల్పించటం విఫలమైందన్నారు. కేవలం రైల్వే రంగంలో 2లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. కరెన్సీ నోట్లను రద్దు చేసి పేదలను ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. అంబానీ, అదానీ వంటి వారు బ్యాంకుల రుణాలను కట్టకుండా ఎగ్గొట్టినా కేంద్ర ప్రభుత్వం వారికే సపోర్ట్ చేస్తోందన్నారు. పేదలను ఇబ్బందులు పెడుతూ, కార్పొరేట్లకు అండగా ఉంటోందన్నారు. సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా జిల్లా కార్యదర్శి పాయం చంద్రన్న, మనోహర్ రాజ్, ఆజాద్, రాకేశ్, పైండ్ల యాకయ్య, రంగయ్య, రవి, అనిల్, సూర్యం, సత్యం, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా ఆరోగ్య శ్రీ ఈ-కేవైసీ

మరిపెడ, అక్టోబర్ 13: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ కార్డులు ఉన్న వారికి రూ.5లక్షల వరకు వైద్య పరిమితి పెంచటంతో గ్రామస్తులు ఈ–కేవైసీ చేయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని తండధర్మారంలో ఈ–కేవైసీసి ముమ్మరం చేశారు. బీఆర్ఎస్ మండల నాయకులు గుగులోత్ లక్‌పతి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఆరోగ్యశ్రీ సేవల పరిమితి రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచిందన్నారు. ఈ–కేవైసీ పూర్తి చేసుకున్న వారికి డిజిటల్ కార్డులు అందజేయనుందన్నారు.


తండధర్మారంలో ఈకేవైసీ చేసుకుంటున్న గ్రామస్తులు

## ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 13: ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉంటే సమస్యలు పరిష్కారమవుతాయని సేవాలాల్ సేన ప్రణాళిక కమిటీ చైర్మన్ దరావత్ ప్రేమ్‌చంద్ నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు గుగులోత్ నందులాల్ నాయక్ అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో త్వరలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

## 'ముర్రుపాలే శ్రేయస్కరం'

గూడూరు, అక్టోబర్ 13: పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి నుంచి వచ్చే ముర్రుపాలు తాగించడం శ్రేయస్కరమని డీఎంహెచ్‌వో డాక్టర్ అంబరీశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని భూపతిపేట రైతువేదికలో అయోధ్యపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లకు 5 రోజులుగా ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పుట్టినప్పటి నుంచి రెండేండ్లలోపు పిల్లలు తీసుకునే ఆహారం గురించి, 30 ఏండ్లు పైబడిన వారికి బీపీ, షుగర్ తదితరాల గురించి ప్రజలకు ఎలా అవగాహన కల్పించాలనేది వారికి శిక్షణ ఇచ్చారు. డాక్టర్ యమున, సీహెచ్‌వో కృష్ణార్జునరావు, లోక్యా, శ్రీనివాస్, హేమలత పాల్గొన్నారు.


స్వామి వారి మాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## వైభవంగా సోమేశ్వరుడి మాస కల్యాణం

పాలకుర్తి, అక్టోబర్ 13 : స్వయంభూ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి క్షీరగిరిక్షేత్రంలో శుక్రవారం సోమేశ్వరస్వామి వారికి మాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య కనుల పండువగా స్వామి వారి కల్యాణం జరిగింది. ఈ కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని కనులారా తిలకించి తరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి

### ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తనయుడు సూర్యచంద్ర


దన్నసరి గ్రామంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్ కుమారుడు సూర్యచంద్ర

కేసముద్రం, అక్టోబర్ 13: సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కుమారుడు సూర్యచంద్ర అన్నారు. మండలంలోని దన్నసరి గ్రామంలో శుక్రవారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలోనే రాష్ట్రంలో 24గంటల ఉచిత విద్యుత్ సరఫరా అవుతున్నదని, పెట్టుబడికి ఎకరానికి రూ.10 వేలు అందిస్తున్నారని తెలిపారు. ఆడబిడ్డల పెండ్లికి కల్యాణలక్ష్మి ద్వారా రూ.1,00,116, కేసీఆర్ కిట్టు, ఆసరా పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. రైతు మృతిచెందితే బాధిత కుటుంబాలకు బీమా ద్వారా రూ.5లక్షలు అందించి కొండంత అండగా ఉంటున్నారని పేర్కొన్నారు. కార్పొరేట్ కంపెనీలు ఏర్పాటు చేయడం వల్ల నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలు అండగా ఉండాలని కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి తెలంగాణపై ఉన్న అభిమానాన్ని చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఓలం చంద్రమోహన్, జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచ్‌ల పోరం అధ్యక్షుడు మాదారపు సత్యనారాయణరావు, రాష్ట్ర నాయకులు నీలం దుర్గేశ్, సర్పంచ్ కొండ్రెడ్డి శ్రీవాణి, సింగిల్ విండో డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నజీర్ అహ్మద్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సట్ల వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు కముటం శ్రీనివాస్, వేం సంపత్‌రెడ్డి, మంకు యాకుబ్‌రెడ్డి, సుంచు సూరయ్య ఉన్నారు.